క్లుప్తంగా

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

అమలాపురం రూరల్: మండలంలోని ఎంపీపీ ఈదరపల్లి ఆర్‌ఆర్ నగర్ పాఠశాలలో విద్యార్థులు గురువారం ముందుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణుల వేషధారణలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాటలు, డాన్సులతో పాఠశాల ఆవరణమంతా ఆహ్లాదకరంగా మారింది. కృష్ణుడు మానవులకి చూపించిన మార్గదర్శలను అందరూ పాటించాలని హెచ్ఎం కడలి మురళి నాగశ్రీ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సహోపాధ్యాయురాలు ముంగండ కోటేశ్వరి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గూటం నాగన్న, పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ సుందర రాజులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఆటో ఢీ

ముమ్మిడివరం: మండలంలోని అనాతవరం సెంటర్లో బస్సు ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాట్రేనికోన మండలం దొంతుకుర్రుకు చెందిన ఆటో డ్రైవర్ కిశోర్ గురువారం అమలాపురం వెళుతుండగా అనాతవరం సెంటర్‌లో బస్సు ఆటో రెండు ఒకేసారి ఢీకొన్నాయి. గాయపడిన కిశోర్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఎస్సై జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధి సీతారామపురం కోలాటివారి రేవులో ఆత్రేయ గోదావరి చెంతన నూతనంగా నిర్మించిన విజయ కనకదుర్గాదేవి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. పండితులు కందికొండ భాస్కర శర్మ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వాచనం, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే సాయంత్రం మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, తదితర పూజలు చేయనున్నారు. శనివారం విఘ్నేశ్వర పూజ, లక్ష్మీగణపతి సహిత నవగ్రహ హోమం, జలాధివాసం, ప్రధాన దేవతా హోమాలు, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ఆదివారం ఉదయం గర్తన్యాసము, రత్నన్యాసం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

జార్జీపేటలో..

తాళ్లరేవు: మండలంలోని జార్జీపేట పంచాయతీలో గురువారం మహాగణపతి, లలితాదేవి, మహాలక్ష్మీదేవి, సరస్వతీదేవి త్రైయాహ్నిక విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈనెల 12 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పండితులు పప్పు రవి శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో గుత్తిన వీరభద్ర రవితేజ శర్మ ఆధ్వర్యంలో ఉదయం వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవస్థానం చైర్మన్‌గా బాబి

అమలాపురం టౌన్: పట్టణంలోని పురాతన శివక్షేత్రమైన చెన్న మల్లేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా దున్నాల వెంకట నాగేంద్రరావు (బాబి) నియమితులయ్యారు. దేవస్థానం ధర్మకర్తల మండలికి నూతన సభ్యులను నియమిస్తూ ధర్మాదాయ, దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా బాబితో పాటు ధర్మకర్తల మండలి సభ్యులుగా ఏడుగురిని నియమించారు. ఎక్స్ అఫిషియో మెంబర్‌గా కొత్తలంక కామేశ్వరావు నియమితులయ్యారు.

ఆలయ చైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

అమలాపురం టౌన్: పట్టణంలోని గోఖిలే సెంటరు వద్ద హైవే చెంతన ఉన్న కృష్ణేశ్వర సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌గా పేరూరి విజయలక్ష్మి నియమితులయ్యారు. ధర్మదాయ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెతోపాటు ధర్మకర్తలుగా ఆరుగురిని నియమించింది. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా మల్లేశ్వర శ్రీసత్య వినయ్‌మూర్తి నియమితులయ్యారు.

చినుకు పడితే చెరువే.!

- కాలువలను తలపిస్తున్న రహదారులు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- మురుగు నీటితో ప్రజల ఇక్కట్లు



చెరువును తలపిస్తోన్న కోరంగి పంచాయతీ- సీతారామపురం రోడ్డు

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు, పల్లపు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడే నిలిచిపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లోని రహదారులు కాలువలు, చెరువులుగా మారుతున్నాయి. చాలా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండటంతో నీరు నిలిచిపోతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో ప్రజలు అనేక ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రమైన తాళ్లరేవుతోపాటు, పి.మల్లవరం, జార్జిపేట, నీలపల్లి, సుంకరపాలెం, ఇంజరం, గాడిమొగ తదితర పంచాయతీల్లోని పలు రహదారులు చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రహదారుల్లో నీరు నిలిచిపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటితో డ్రైనేజీలోని మురుగునీరు కలిసిపోయి రహదారిపై చేరడంతో అపారిశుద్ధ్యం తాండవిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యానాం- కాకినాడ రహదారిలోని కోరంగి పంచాయతీ- సీతారామపురం ప్రధాన రహదారి వర్షం వచ్చిందంటే చాలు చెరువును తలపిస్తోంది.

డ్రైనేజీలు సరిగా లేక ఇబ్బందులు

యానాం- ద్రాక్షారామ రహదారిలోని సుంకరపాలెం రోడ్డు, తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్, మాధవరాయునిపేట, పరదేశమ్మ వీధి, నీలపల్లి చెక్‌పోస్ట్ సెంటర్, జమ్మిచెట్టు సెంటర్ తదితర రహదారులు చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయి. ఈ నీటిలోనే వాహనదారులు, పాదచారులు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రహదారి చెంతన వ్యాపార సముదాయాలు ఉండటంతో వారు మురికినీటితో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారీ వ్యాపారాలు సాగడంలేదని వాపోతున్నారు. అదే విధంగా పలు గ్రామాల్లో ఉన్న అంతర్గత రహదారుల్లో సైతం వర్షపు నీరు నిలిచిపోతుంది. చాలా గ్రామాల్లో డ్రైనేజీలు లేకపోవడం, ఉన్న డ్రైనేజీల్లో పూడికలు సరిగా తీయకపోవడంతో వర్షపు నీరు, డ్రైనేజీల్లోని మురుగునీరు కలిసిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగిపోయి డెంగీ, మలేరియా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయేమోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు సిమ్మెంటు రహదారులపై చూపే శ్రద్ధ డ్రైనేజీలపై చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, అలాగే ప్రధాన రహదారుల్లో మురుగునీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు.



డ్రైనేజీ లేకపోవడంతో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



సుంకరపాలెంలో చెరువును తలపిస్తున్న రోడ్డు

తీవ్రంగా నష్టపోతున్నాం



వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలతోపాటు రహదారి చెంతన ఉన్న వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీలు పూడుకుపోయి చెరువుల్లా మారుతున్నాయి. రహదారిపై భారీ వాహనాలు వెళ్లినప్పుడు నీరు దుకాణాల్లోకి వచ్చేస్తుండటంతో అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఆ నీటిలో దుకాణాల వద్దకు ప్రజలు రాకపోవడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– అడబాల శివ, ప్రముఖ వ్యాపారి, సుంకరపాలెం జంక్షన్

ఎమ్మెల్సీపై విమర్శలు తగవు



ఎమ్మెల్సీపై విమర్శలను ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లరేవు: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ని ఉద్దేశించి జనసేన ఎమ్మెల్యే సత్యనారాయణతోపాటు ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. గురువారం జార్జీపేటలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ రెడ్డి నాగేశ్వరరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉప సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, పాలకవర్గ సభ్యులు శీలి రాజు తదితరులు మాట్లాడారు. రాజకీయాల్లో విమర్శలు చేస్తే దానికి ప్రతి విమర్శ చేసుకోవడం సహజమన్నారు. విమర్శలోని అంశాన్ని రాజకీయంగా పరిగణనలోకి తీసుకోవాలే తప్ప వ్యక్తిగత ద్వేషాలు, హెచ్చరికలకు పోకూడదన్నారు. విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలతో ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగిన వ్యక్తి ఇజ్రాయిల్ అన్నారు. పార్టీకి 14 ఏళ్లుగా సేవలు చేయడంతోపాటు 22 మంది ఎమ్మెల్యేలు ఓటు వేస్తే ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైన విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఒక దళిత ఎమ్మెల్సీపై ఆ విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయనపై మరోసారి విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బడుగు శ్రీనివాసరావు, నాయకులు పెట్ల శాంతకుమారి, గుత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



జాతీయ జెండాను ఊరేగిస్తున్న విద్యార్థులు

యానాం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్–1, 2 యూనిట్‌ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు సిద్దిరెడ్డి శ్రీనివాస్, చెల్లి నరేష్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ భాస్కర రెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యతను, దేశ భక్తిని చాటాలని కోరారు. గిరియాంపేటలో పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైతం హరఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు శాంతకుమార్, శ్రీలత, జ్యోతి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ఊరేగింపు

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్లలో శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు, గ్రామానికి చెందిన యువకులు భారీ జాతీయ జెండాను పురవీధుల్లో ఊరేగించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 200 అడుగుల జాతీయ జెండాను ఊరేగించి మానవహారం ఏర్పాటు చేశారు. విద్యార్థులు పలు సాహస కార్యక్రమాలు నిర్వహించారు. ఊరేగింపులో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. విద్యార్థులు చేసిన పిరమిడ్ చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోకవరపు వెంకటరాజు, పెదబాబు, గోకవరపు వీరభద్రయ్య పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

అమలాపురం టౌన్: స్థానిక మార్కెట్ వీధిలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బీవీఎస్‌సీ పోలిశెట్టి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. జాతీయ జెండా గొప్పదనాన్ని వివరించారు.

పోరాటంలో ధీరులు



భూపతిరాజు జగ్గరాజు (ఫైల్)

అమలాపురం రూరల్: దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించడం కోసం బ్రిటిష్ వారిపై పోరాడిన యోధులు ఎందరో ఉన్నారు. మండలంలోని సమనస పంచాయతీ పరిధిలో రంగాపురం, వన్నెచింతలపూడి గ్రామాల్లో 17 మంది సమరయోధులు బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి దేశానికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో పోరాటం చేశారు. ఆనాటి స్వాతంత్ర్య స్ఫూర్తి వన్నెచింతలపూడి గ్రామ ప్రజలు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. రంగాపురానికి చెందిన భూపతిరాజు జగ్గరాజు, వన్నెచింతలపూడికి చెందిన నడింపల్లి బంగ్రారాజు నాయకత్వంలో బ్రిటిష్ పోలీసుల లాఠీ దెబ్బలు తిని, 1930లో మద్రాసు, రాజమండ్రి, బళ్లారి సెంట్రల్ జైళ్లలో శిక్ష అనుభవించారు. ఊరూ వాడా సైకిల్‌పై తిరుగుతూ ఉభయగోదావరి జిల్లాల్లో ఆందోళనలు, ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఉద్యమ స్ఫూర్తిని నింపి స్వాతంత్ర్య ఆవశ్యకతను వివరిస్తూ రాత్రి వేళల్లో సభలు, సమావేశాలు నిర్వహించేవారు. 17 మంది సభ్యుల్లో రోజుకొకరు ఆర్డీఓ కార్యాలయం వద్ద వందేమాతరాన్ని ఆలపించేవారు. జట్టు సభ్యులు దెబ్బల నుంచి కోలుకోపోతే వారి తరపున జగ్గరాజు వెళ్లి పోలీసుల దెబ్బలకు ఎదురు నిలిచేవారు. వీరు యావదాస్తిని ఉద్యమానికి ధారపోసిన ధీరులు.

ఉద్యమంలో కొరియర్‌గా

స్వాతంత్ర్య పోరాటంలో సమాచారాన్ని తెలియజేయాలంటే పోస్టుకార్డులపై ఆధారపడేవారు. అది బ్రిటిష్ ప్రభుత్వం ఉత్తరాలపై నిఘా ఉంచడంతో రహస్యంగా సమాచారాన్ని ఇతర ప్రాంతాలకు చేర్చేందుకు జగ్గరాజు కొరియర్‌గా వ్యవహరించేవారు. 1932లో ఉద్యమానికి సంబంధించిన టపాను రహస్యంగా తుని చేరవేస్తుండగా పిఠాపురంలో బ్రిటిష్ పోలీసులకు జగ్గరాజు చిక్కాడు. పోలీసులు చావు దెబ్బలు కొట్టి పొదల్లో పడేశారు. కొన ఊపిరితో ఉన్న జగ్గరాజును స్థానికులు రక్షించి స్వగ్రామానికి చేర్చారు. వన్నెచింతలపూడిలోని ఓ ఆశ్రమంలో గాయాలు తగ్గేవరకు విశ్రాంతి తీసుకొని మళ్లీ ఉద్యమానికి సిద్ధమయ్యేవారు.

తామ్ర పత్రం ప్రదానం

1973లో జగ్గరాజు సేవలు గుర్తించిన అప్పటి జిల్లా కలెక్టర్ రంగాచారి జగ్గరాజుకు తామ్ర పత్రం అందజేశారు. 1975లో పాలకొల్లులో జరిగిన ద్వితీయ స్వాతంత్ర్య సమరయోధుల మహాసభ వద్ద సత్కారం అందుకున్నారు. 1983లో ఆగస్టు 21న 62 ఏళ్ల వయసులో అనారోగ్యంతో మృతి చెందారు. తాత వారసుడిగా ఉన్న నడింపల్లి ఉదయ్‌బాబు సమనస మాజీ సర్పంచ్‌గా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. వన్నెచింతలపూడిలోని చెరువు వద్ద నడింపల్లి బంగ్రారాజు, లక్ష్మీనరసాపురం వద్ద జగ్గరాజు విగ్రహాలను ఏర్పాటు చేశారు.

కాగడాలతో మౌన ప్రదర్శన



కాగడాలతో మౌన ప్రదర్శన చేస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: దేశ విభజన భయానక రోజు 1947 ఆగస్టు 14న లక్షలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సందర్భాన్ని, వారి త్యాగాలను స్మరించుకుంటూ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక గడియారం స్తంభం సెంటరులో నాయకులు కాగడాలతో మౌన ప్రదర్శన నిర్వహించారు. దేశ విభజన సంఘటనలకు సంబంధించిన ఫొటోల ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈ-స్టాంప్ సమస్యను పరిష్కరించాలి

యానాం: ఈ–స్టాంప్‌ను ఇవ్వకపోవడంతో పది రోజులుగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారని గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్ ఓ ప్రకటనలో కోరారు. ఈ–స్టాంప్‌ను ఇవ్వకపోవడంపై స్థానిక అడ్మినిస్ట్రేటర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయం తెలిసి యూనియన్ బ్యాంకు మేనేజర్‌తో ఆయన మాట్లాడారు. దీంతో టెక్నీషి యన్‌ను పిలిపించి మిషన్‌కు మరమ్మతులు చేసి రెండు రోజుల్లో ఈ–స్టాంపులు అందజేస్తామన్నారు. అదేవిధంగా రూ.500 లోపు ఈ–స్టాంపులకు అదనంగా తీసుకుంటే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో తిరుకోటి ఆదిమూర్తి, చెక్కల అరుణ్, పైడికొండల రాజబాబు పాల్గొన్నారు.

అక్రమ ఆక్వా సాగుతో అనర్థం

ఉప్పలగుప్తం: అక్రమ ఆక్వా సాగుతో గ్రామానికి అనర్థం జరుగుతుందని మండలంలోని సన్నవిల్లికి చెందిన పలువురు గ్రామస్తులు తహసీల్దార్ దివాకర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ, గ్రామంలో కొన్నేళ్లుగా అక్రమ ఆక్వా సాగు జరుగుతుందని గ్రామస్తులు కోర్టును ఆశ్రయించడంతో దానిని నిలిపివేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. కొంతమంది రైతులు పర్యావరణానికి ఆటంకం లేని సాగు చేసుకుంటామని చేపల చెరువుల ముసుగులో రొయ్యలను పెంచుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రొయ్యల సాగుకు అధిక శాతం ఉప్పునీరు పెట్టి వాటిని పొలాల్లోకి వదిలేయడంతో కొబ్బరి, వరి పంటకు నష్టం కలుగుతుందన్నారు. కోర్టు ఆదేశాలను దిక్కరించి ఆక్వా సాగు చేస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని వివరించారు. సాగు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి గ్రామాన్ని ఆక్వా కాలుష్యం నుంచి రక్షించాలని తహసీల్దార్‌ను గ్రామస్తులు కోరారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెంలో గున్నవంతుల అగ్రహారం యూపీ పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సైకిల్ పోటీలు నిర్వహించారు. సర్పంచ్ మట్ట వైదేహి సాయి రామారావు గురువారం పోటీలను ప్రారంభించారు. పోటీల్లో దోమ అరుణ్ తేజ, పిక్కిలి ఏసు రత్నం, ఈతకోట సాత్విక్, చేట్ల విద్యా షాహిని, కోనే సత్య విజేతలుగా నిలిచారు. శుక్రవారం బహుమతి ప్రదానం జరుగుతుందని ఇంగ్లిష్ టీచర్ అప్పారావు తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వృక్తత్వం, చిత్రలేఖనం, పరుగుపందెం విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం వరప్రసాదరావు, తెలిపారు.

వరి పొలాల పరిశీలన



నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం: వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి కుమార్ బాబు, ఏరువాక శాస్త్రవేత్త నందకిషోర్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. మండలంలో ప్రాథమికంగా 468 ఎకరాల వరి చేను వర్షానికి నీట మునిగినట్టు ఏవో కుమార్‌బాబు తెలిపారు. నీట మునిగిన వరి చేలలో నీరును బయటకు తోడి పాముమడ తెగులు ఆశించకుండా ఫ్లెక్సోకోనోజల్ ఒక లీటర్ నీటికి 2 మిల్లీలీటర్ల ద్రావణాన్ని, ఆకుమడత తెగులు ఆశించకుండా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఒక లీటర్‌కు రెండు గ్రాముల ద్రావణాన్ని కలిపి పిచ్‌కారీ చేయాలని రైతులకు సూచించారు.

ముంపు నీరు దిగేలా చూడండి

ఐ.పోలవరం: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి చేలు ముంపు బారిన పడ్డాయని, ముంపు నీటిని తక్షణం బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని ఏఓ వాణి రైతులకు సూచించారు. మండలంలో ముంపుబారిన పడిన వరిచేలను గురువారం పరిశీలించారు. వర్షాలకు వివిధ దశల్లో ఉన్న పంటను రక్షించుకోవడానికి రైతులకు సూచనలు, సలహాలిచ్చారు. జిల్లాలో 68 శాతం మేర నాట్లు పూర్తయ్యాయన్నారు. నారుమడిలో విత్తనం చల్లిన రెండు, మూడు రోజుల వయసున్న చేలల్లో మూడు రోజులకు మించి ముంపునీరు ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని, వీలైనంత త్వరగా నీరు బయటకు తీయాలన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏవో

ఐ.పోలవరం: మండలంలో ఎరువులు, పురుగు మందులు విక్రయించే సహకార సంఘాలు, మన గ్రోమోర్ సంస్థకు చెందిన దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి వాణి తనిఖీ చేశారు. మండల పరిధిలో తిల్లకుప్ప సహకార సంఘంలో ఎరువులు, పురుగు మందులు అమ్మకాల తీరును గురువారం పరిశీలించారు. సొసైటీలోని స్టాక్, రికార్డులను పరిశీలించారు. విక్రయదారులకు పలు సూచనలు చేశారు.

పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

ఉప్పలగుప్తం: చైనాలోని శాంగ్లో జిల్లాలో డిసెంబర్ 4 నుంచి 13 వరకూ జరిగే యూత్ వాలీబాల్ పోటీలు ఎంపికకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాకినాడలో నిర్వహించిన అండర్–15 వాలీబాల్ పోటీలకు మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దేవరపల్లి శ్రీరామ్, తొత్తరమూడి అభిరామ్, గాలిదేవర యసశ్విని, వర్షిణి, దివ్యలేఖన ఎంపికై నట్టు పీడీ ఫణీంద్ర గురువారం తెలిపారు. ఈ పోటీలను మూడు దశల్లో జరిపి జాతీయ స్థాయిలో ఎంపిక చేస్తారని వివరించారు. వీరంతా ఈ నెల 18న రెండో దశగా విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్ఎం జి.కనకదుర్గ, పీడీ సరస్వతి, పీఈటీ విజయభాస్కర్, విద్యార్థులను అభినందించారు.

పీఎమ్ఎమ్‌వైతో గర్భిణులకు ప్రయోజనం

యానాం: ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం గర్భిణులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తుందని, ఈ పథకం నమోదును ఈనెల 15 వరకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పొడిగించిందని మహిళా సాధికారిత హబ్ బృందం పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అందే ప్రయోజనాలను వివరిస్తూ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో బ్యానర్లు ప్రదర్శిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

అభిమానుల సందడి

అమలాపురం టౌన్: జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్–2 చిత్రం విడుదల సందర్భంగా ఆ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్ వద్ద అభిమానులు గురువారం సంబరాలు చేశారు. థియేటర్ వద్ద కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి, బాణా సంచా కాల్చి సందడి చేశారు. జూనియర్ ఎన్టీఆర్ సంఘం గౌరవాధ్యక్షుడు వాసంశెట్టి జగదీష్, ఆవుపాటి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన అధికారులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసిన మునిస్వామి

యానాం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు పుదుచ్చేరి పీడబ్ల్యూడీ శాఖ మంత్రి లక్ష్మీనారాయణ గురువారం యానాం వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద పలువురు అధికారులు ఆయనకు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అంతకుముందు విశాఖపట్టణం విమానాశ్రయంలో ఆర్ఏఓ మునిస్వామి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.